


లక్ష్మి పేస్ట్ వేసిన బ్రష్ పట్టుకొచ్చియిచ్చింది. మళ్ళీ పిల్లల్ని దాటుకుంటూ లోపలికి నడిచాడు రామారావు.

బాత్‌రూమ్ పరిసరాల్లో వున్నా, వంటగదిలో వున్నా పొద్దున్న ఆ టైములో ట్రాన్సిస్టర్ తనకి వినపడేదూరంలో పెట్టుకుంటాడు రామారావు.

భక్తి రంజని టైముకి వో పని, పొలం పనులు వచ్చేటప్పటికి వో పని... యిలా తనని తను చెక్ చేసుకుంటూ ఏడున్నర అయేటప్పటికి ఆఫీసుకి తయారవుతాడు. ట్రాన్సిస్టర్‌లో వచ్చే ప్రోగ్రాముల్లో ఒకటి రెండు మాటలకన్నా ఎక్కువ రామారావు చెవిని పడవు.

సరిగ్గా తెలుగు వార్తలొచ్చే టైముకి స్నాన ఘట్టంలో వుంటాడు. మిగిలినవన్నీ ఎలావున్నా, ఈ హడావిడి లేకుండా నిద్దర పక్కమీద బద్ధకంగా కూచుని వేడివేడి కాఫీ తాగుతూ రోజూ వార్తలు వినాలని రామారావు కోరిక...ఏ శెలవరోజో వచ్చినా బద్ధకించి అసలు ఆ టైముకి నిద్రలేవడు.

అందువల్ల ప్రతిరోజు, స్నానం చేసే టైముకి వార్తల చప్పుడు, పోసుకుంటున్న నీళ్ళచప్పుడు కలిసి కంగారు పెట్టేసి చిరాకు తెప్పిస్తాయి.

అలా వచ్చిన చిరాకుని బలవంతంగా అణుచుకుని లోపలికొస్తే ... అదే సమయానికి పిల్లలు లేస్తారు. అలా లేచినవాళ్ళు అల్లరి చెయ్యకుండా వుంటే ... మిగిలిన పనులన్నీ సవ్యంగా జరిగితే ... ఆఖర్లో యింక బైలుదేరే ముందు భార్య ఆరోజు తాలూకు అర్జంటు అవసరాలేవీ నసుగుతూ చెప్పకుండా వుంటే ప్రశాంతంగా ఆఫీసుకి బైలుదేరతాడు... ఈ అడ్డంకులన్నీ దాటటానికి అన్ని పనులూ చాలా కంగారుగా చేస్తాడు.

ఆ రోజు అన్నీ సవ్యంగానే జరిగాయి. చివర్లో రామారావు బైలుదేరేముందు లక్ష్మి టిఫిన్ డబ్బా యిస్తూ ఏం నసగలేదు.

ఇంక గుమ్మం దాటుతుండగా మటుకు అడిగింది... "సాయంత్రం ఎన్నింటికి వస్తారు...?'' అని

హడావిడిగా వీధిలోకి నడుస్తూ...'ఏమో' అన్నాడు భార్య అలా అడగటంలో ప్రత్యేకమైన కారణం ఏం వుండదని రామారావుకి తెలుసు. అప్పుడప్పుడు లక్ష్మి అలా అడగటం, తను ఏదో సమాధానం చెప్పటం అలవాటే...

వీధిలో సాధారణంగా దేన్నీ పరికించి చూడడు రామారావు. కంగారుగా నడిస్తే బస్ స్టాండ్ చేరుకోవటానికి పావు గంట పడుతుంది. ఎనిమిది ఇరవై కి బస్...అది అందుకోగలిగితే ఇరవై అయిదు నిముషాల ప్రయాణం...దాని తరువాత రెండో బస్ దొరకటానికి కనీసం ఇరవై నిముషాలు పడుతుంది. మళ్ళీ వో పావుగంట ప్రయాణం. వీటిలో లింకు మిస్సయినా, రెండు బస్సుల్లో ఏ బస్సు ఆలశ్యం అయినా ఆఫీసుకి లేట్ అవుతుంది.

ఆఫీసుకి లేట్‌గా వెడితే పడాల్సిన అడ్డమైన యాతనంతా తప్పించుకోటానికి యీ రకం అలవాట్లన్నీ చేసుకున్నాడు.

వంద గజాలు నడిచి వీధిమలుపు తిరిగాడు. ఎవరిదో శవం...ఆ యింటి ముందు నుంచి అప్పుడే లేవదీస్తున్నారు. గబుక్కుని చూపు మరల్చుకున్నాడు.

రామారావుకి శవాలంటే భయం. ఎప్పుడైనా ఏ శవమైనా కళ్ళబడితే ఏవేవో ఆలోచనలొస్తాయి. అలా యిబ్బంది కలిగించే ఆలోచనల్ని దూరం చేసుకోటానికి నానా యాతన పడతాడు.

రామారావుకి ముందుగా చాలా మంది జనం గుంపుగా నిలబడ్డారు. శవం వెనక నిలబడలేదు... ...నడక ఆలశ్యమైతే బస్ మిస్సయిపోతుంది.

నెమ్మదిగా అందర్నీ దాటుకుంటూ గుంపు ముందుకి చేరాడు. అలా అందర్ని దాటుతున్నప్పుడు శవం మరోసారి రామారావు కళ్ళబడింది.

ఇందాకటి కన్నా గబగబా నడవటం మొదలెట్టాడు. అలా గబగబా నడుస్తూనే... 'శవాన్ని గుర్తు తెచ్చుకోకూడదు...గుర్తు తెచ్చుకోకూడదు...'' అనుకున్నాడు.

అలా అనుకుంటుండగానే గబుక్కుని అనిపించింది రామారావుకి ''బతికున్నన్ని రోజులు ఆ శవం కూడా యిలాగే కంగారుపడి యాతన పడి...''ఆలోచనని మధ్యలోకి తుంచేస్తూ... ''ఛ...ఛ'' అనుకున్నాడు.

మరో నాలుగడుగులు వేశాడు. ఇందాకటి ఆలోచనే మళ్ళీ రాబోయింది. ఆలోచన మారటానికి ఏదో ఒకటి చెయ్యాలనుకున్నాడు.

కళ్ళ కెదురుగా పెద్ద సినిమా పోస్టరు కనబడింది. పోస్టరులో ఎవరో అమ్మాయి వొంగునుంది.

''బావుంది...అమ్మాయి బావుంది... ఎత్తుగా ఆ అమ్మాయి ఛెస్ట్ మరీ బావుంది'' అనుకున్నాడు. 'ఆ సినిమా చూస్తే ఎలా వుంటుందో...'' అనుకున్నాడు. ఇలా ఆలోచనల్ని చెక్ చేసుకుంటూ బస్ స్టాండ్‌కి వచ్చాడు రామారావు.

''టైం ఎంతయి వుంటుందో...'' అనుకున్నాడు. రామారావుకి వాచి లేదు. ఎప్పుడు టైము తెలుసుకోవాలన్నా, ఎవర్నో ఒకర్ని అడగాలి. కొంత మంది అడగ్గానే చెప్పేవారు. కొంత మంది రెండు మూడు సార్లు అడిగితేనే గానీ చెప్పేవారు కారు. కొంత మంది విసుక్కుని కానీ చెప్పేవారు కారు.

అందువల్ల ఒకటి రెండు సార్లు మనుషుల ముఖాలు రీడ్ చేసి, కొంచెం ప్రశాంతంగా కనబడిన వాళ్ళనే టైమ్ అడగటం అలవాటు చేసుకున్నాడు.

బస్ స్టాండ్‌లో వున్న వాళ్ళందర్నీ పరికించి ఒకాయన్ని అడిగాడు.

"ఎనిమిదీ పది..." పరవా లేదనుకున్నాడు. అందుకోవాల్సిన రెండు బస్సులు అందుకుని టైముకి ఆఫీసుకి చేరాడు, రామారావు. చేరాక అనుకున్నాడు... 'అనవసరంగా కంగారు పడ్డానేమో' అని

ఇంకా ఆఫీసులో ఎవరూ సీట్లలో సెటిల్ కాలేదు. చిదంబరం వచ్చాడేమోనని చూశాడు. వచ్చిన జాడ ఎక్కడా కనబడలేదు. చిదంబరం, రామారావు కలిసి చదువుకున్నారు. ఇంచుమించు ఆ ఆఫీసులోనూ ఒకేసారి చేరారు.

మరో పది నిముషాలకి చిదంబరం వచ్చి రామారావుని పలకరించి తన సీటుకి వెళ్ళాడు. ఇద్దరూ మాట్లాడుకోటానికేం సమయం దొరకలేదు.

కొద్దిగా ఫ్యాన్స్ తిరుగుడు ... కాగితాల చప్పుడు మొదలైంది. రామారావు దగ్గరికి ప్యూన్ ఏదో ఫైలు పట్టుకొచ్చి యిచ్చాడు. ఓ స్టేట్‌మెంటు అర్జంట్‌గా మధ్యాహ్నం లోపు తయారు చెయ్యమని మేనేజరు నోటుంది ఫైలుకి.

నెమ్మదిగా టేబుల్ మీదకి వొంగి ఫైలులో కూరుకు పోయినట్టు కూచుని పని మొదలెట్టాడు. అంతకు ముందు అందులో వేసున్న అంకెలు గజిబిజిగా వుండి ఏది ఏమిటో వో పట్టాన అర్థం కాలేదు రామారావుకి.

వాటితో ఎంతోసేపు వోపిగ్గా కుస్తీ పడితే వో గంటకి వో దారికి వొచ్చింది పని.

నెమ్మదిగా జేబులోంచి సిగరెట్టు తీసుకుని కాల్చుకున్నాడు.

టీ తాగితే బావుణ్ణు అనిపించింది... వొద్దులెద్దూ సిగరెట్ కాలుస్తున్నాగా......... అనుకున్నాడు.

రామారావుకి వో బడ్జెట్ వుంది. అది రోజుకి రెండు రూపాయలు. ఎంతో తప్పనిసరైతే తప్ప అంత కన్నా ఎక్కువ ఖర్చు కానివ్వడు.

మొదటి బస్సుకి నలభై పైసలు... రెండో బస్సుకి యిరవై పైసలు. ఆఫీసుకి రావటానికి, యింటికి వెళ్ళటానికి రూపాయి యిరవై పైసలుపోతే మధ్యాహ్నం టీకి ముప్పై పైసలు. మిగిలిన అర్ధ రూపాయి సిగరెట్లకి అగ్గిపెట్టెకి... తన అవసరాల్ని అంతకే తప్పని సరిగా పరిమితం చేసుకున్నాడు రామారావు.

రామారావు యించుమించు టీ తాగాలనే కోర్కెని చంపుకునే సమయానికి... చెప్పులు, చీర కలిసి చేసే గమ్మత్తయిన చప్పుడుతో వచ్చింది మేనేజర్‌గారి స్టెనో స్టెల్లా...

వచ్చి... "హల్లో..." అంది.

అంతకు ముందటి టీ తాలూకు కోరికని జయించగలిగిన సరదాలో సిగరెట్ పొగ మరింతగా పీల్చిన రామారావు కంగారు పడుతూ... "హలో..." అన్నాడు.

స్టేట్‌మెంట్ ఎంతవరకూ వచ్చిందో మేనేజర్ చూసి రమ్మన్నారు..." అంది ముద్దుముద్దుగా స్టెల్లా...

స్టెల్లాకి అంతగా తెలుగు రాదు. అందుకే చిలక పలికినట్టు, చిన్న కుర్రాడు నోట్లో ముద్ద పెట్టుకుని మాట్లాడినట్టు మాట్లాడుతుంది.

"అయిపో వచ్చింది... అయిపో వచ్చింది..." అన్నాడు రామారావు.

"బి క్విక్..." అంటూ మళ్ళీ చప్పుడు అందరికీ పంచిపెడుతూ వెళ్ళిపోయింది.

"క్విక్ అట...క్విక్... కూచుని చేస్తే తెలుస్తుంది. అంకెలతో యీ తలనెప్పి..." అనుకున్నాడు రామారావు.

వీపు పైభాగం, మెడచుట్టూ బలంగా వున్న ఆడాళ్ళంటే వోరకమైన ఆకర్షణ రామారావుకి. వెళ్ళిపోతున్న స్టెల్లాన్ని, జాకెట్ అంచులు నొక్కేస్తున్న మెడ వొంపుల్ని చూస్తూ...'రోజు రోజుకి బలిసిపోతోంది...' అనుకున్నాడు.

స్టెల్లాతో కలివిడిగా మాట్లాడాలని ఒకటి రెండుసార్లు ప్రయత్నం చేశాడు రామారావు. కానీ చేతకాలేదు. దాంట్లో స్టెల్లా తప్పేం లేదు. రామారావే తడబడేవాడు. ఎవరితో నేనాసరే సరదాగానే వుండేది... ఎలాంటి జోక్ నేనాసరే స్పోర్టివ్‌గానే వినేది స్టెల్లా.

రామారావు అవస్థ పసిగట్టి చిదంబరం అన్నాడు వోసారి. "ఎందుకురా అలాలొట్టలేస్తావు...గట్టిగా వో వందనీదికాదనుకో." అని.

స్టెల్లా గురించి అలాంటి వార్తలు యిదివరకే ఆఫీసులో విని వుండటంవల్ల రామారావు కోపం తెచ్చుకోలేదు. కానీ చాలాసార్లు వంద రూపాయల్ని, స్టెల్లాని తూచి చూసుకున్నాడు. జీవితంలో చాలా విషయాల్లాగే ఈ విషయంలోనూ ఎటువేపూ మొగ్గు చూపలేక తటస్థంగా వుండిపోయాడు.

రామారావు స్టేట్‌మెంట్ పూర్తి చేసేటప్పటికి లంచ్ టైమయింది. స్టేట్‌మెంట్ మేనేజర్ కిచ్చేసి లంచ్‌కి వెడదామనుకున్నాడు. కానీ చాలా ఆకలిగా, అలసటగా వుండి


## వచ్చేవారం

- అమేథీ విజేత రవీంద్ర ప్రతాప్‌సింగ్ (విశేష రచన) — శివా
- తప్పులు-త్యాగాలు (కథ) — కంఠంనేని రాధాకృష్ణమూర్తి
- పతనం (కథ) — పంతుల జోగారావు
- పగిలిన అద్దాలు (కథ) — రామా చంద్రమౌళి
- ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువు - ఎలుక! — తులసి
- శ్రీశ్రీ చైనాపర్యటన విశేషాలు • రాజు—పేద
- పావేరి • సినీతంత్ర • సమాజానందస్వామి

ఇంకా ఇతర ఆకర్షణలు

చిదంబరంతో కలిసి లంచ్‌కి బయలుదేరాడు.

లంచ్ కోసం వాళ్ళకి ప్రత్యేకంగా కాంటీనేం లేదు. కొంతమంది తెచ్చుకున్న టిఫెన్లు సీటు కదలకుండానే తినేవారు. కొంతమంది ఎదురుగా రోడ్డుకటువేపున్న యిరానీహోటల్ కెళ్ళి తినేవారు, చిదంబరానికి, రామారావుకి హోటల్‌కి వెళ్ళటమే అలవాటు.

"తెల్లవార్లు పేకాడాం..." అన్నాడు చిదంబరం.

చిదంబరం పేకాట రామారావు ఎరిగున్నదే, "ఏమేనా వచ్చిందా...?" అన్నాడు,

"ఆఁ నాలుగు రూపాయలొచ్చింది..." అన్నాడు చిదంబరం నవ్వుతూ...

"నవ్వుతావేం..." అన్నట్టు చూశాడు రామారావు,

"ముందు నలభై వొచ్చింది, లేచి వచ్చేద్దామనుకున్నాను, హేండ్ రెయిజ్‌లో వుంది కదా అని మరి కాస్సేపు కూచున్నాను, ఇరవై పోయింది, అలా వచ్చీ పోయి తెల్లారే సరికి నాలుగు రూపాయలు మిగిలింది..." అన్నాడు చిదంబరం ఆవలిస్తూ,

చిదంబరం వాళ్ళు తెల్లవార్లు పేకాట్టం రామారావుకి తెలియనిదేం కాదు. ఒకటిరెండుసార్లు చిదంబరంతో వెళ్ళి చూశాడు. జీవితంలో ఏ పనీ అంతకన్నా యింటరెస్టింగా వుండదన్నట్టు కదలకుండా వాళ్ళు ఆట్టం, చిదంబరానికి డబ్బులు రావటం చూసి "తను కూడా ఆడితే..." అనుకున్నాడు కానీ ఆదే ధైర్యం చాలలేదు.

పేకాట గురించి చిదంబరం చెపుతుంటే వోపిక అనుకోకుండానే అడిగాడు రామారావు... అలా ఆట్టంలో ఏమైనా థ్రిల్ వుంటుందా...?" అని.

"ఎందుకుండదూ, థ్రిల్ వుంటుంది... టెన్షనూ వుంటుంది. అయినా నీలాంటివాడికి ఆ థ్రిల్ అవీ వద్దులే..." అన్నాడు చిదంబరం రామారావు వాలకం కనిపెట్టినట్టు.

"అబ్బే నేనాట్టం గురించి కాదులే..." అనేశాడు రామారావు.

మధ్యాహ్నం అంత అవసరమైన పనేం లేక, పొద్దున్న అలసట తీరక కాస్త విశ్రాంతిగా కూచున్నాడు ఆఫీసులో రామారావు.

అలా విశ్రాంతిగా కూచుని ఆఫీసంతా చూస్తుంటే అందరూ వొకేలా కనిపించారు రామారావుకి మాట్లాడుతున్నవాళ్ళు, మాట్లాడకుండా రాసుకుంటున్నవాళ్ళు... నవ్వుతున్నవాళ్ళు నవ్వకుండా ముఖం ముడుచుకొని కూచున్నవాళ్ళు...

అలా చూసి, చూసి విసిగెత్తి మరికాస్సేపు ఏదో పని కల్పించుకుని చేశాడు.

అయిదవుతుంటే నెమ్మదిగా టేబిల్ సర్దేసి లేచాడు. అప్పటికే చిదంబరం కూడా అన్నీ సర్దేశాడు. ఇద్దరూ కలిసి ఆఫీసుదాటి బైటకొచ్చేవరకూ ఏం మాట్లాడుకోలేదు.

బైటికొచ్చి నాలుగడుగులేశాక ... సెంటర్‌కెడదామా..." అనడిగాడు చిదంబరం. 'వెడదాం' అన్నట్టు తలూపాడు రామారావు:

సెంటరంటే మరో ఫర్లాంగుదూరంలో వున్న హోటల్. కొంచంగా ఖాళీగా వుంటుంది. సాయంత్రం ఆఫీసు లవగానే కొంతమంది చిదంబరం స్నేహితులు, కొంతమంది రామారావు స్నేహితులు వచ్చేచోటు.

పొద్దున్నలాగ సాయంత్రవూట టైముకే బస్సు ఎక్కాలన్న హడావిడిలేదు. అలా అని యింటికెడుతున్నామన్న పెద్దవుత్సాహం లేదు. తేడా అల్లా సాయంత్రంపూట మామూలుగా మనుషులు నడిచినట్టు కొంచం తాపీగా నడవటం. ఇద్దరూ కలిసి సెంటర్ చేరిన కాస్సేపటికి మరోయిద్దరు వచ్చారు.

కాస్సేపు ఆఫీసుల గొడవ, కాస్సేపు సినిమాల గొడవ...మరి కాస్సేపు అప్పుల గొడవ.... యిలా యిలా రకరకాల మాటలు సాగాయి. ఎవరికీ దేనిమీదా ప్రత్యేకమైన శ్రద్ధలేదు.

ఎవరికి వోపికున్నంత సేపు వాళ్ళు వాగటం. ఎవరికీ వోపిక లేకపోచే చూస్తున్నట్టు ఒకరికి తెలియకుండా ఒకరు రోడ్డు మీద వచ్చిపోయే ఆడాళ్ళని చూట్టం.

జీవితంలో చాలాఏళ్ళు, పెళ్ళయినతర్వాత కూడా రామారావుకి అలవాటుండేదికాదు. ఏ ఆడవాళ్ళన్నా ఎక్కువ శ్రద్ధగా చూసేవాడు కాదు. ఎప్పుడేనా ఆడతనం గుర్తొస్తే... సాధారణంగా భార్య లక్ష్మి గుర్తొచ్చేది. కానీ ఎప్పణ్ణించో తెలియకుండానే రామారావులో యీ అలవాటు ప్రవేశించింది.

అంతే అలావచ్చిపోయేవాళ్ళని చూట్టం... ఫలానా ఆడది ఫలానాలా వుంది అనుకోటం... ఒకోసారి భార్యతో పోల్చుకోటం ... పోల్చుకుని... లక్ష్మికూడా అందమైందే... అని తనని తను సరిపెట్టుకోటం...అప్పటికీ మనసు వొప్పుకోకపోతే...పదేళ్ళు సంసారం చేసి, ముగ్గురు పిల్లల్ని కన్నాక ఏ ఆడదైనా అంతే"...అనుకోటం, యిలా అలవాటైంది రామారావుకి.

మరో అరగంట గడిచాక అందరూ యిళ్ళకి బైలుదేరారు.

మామూలుగా రోజూలాగే... వీధిలైట్ల మధ్యలో వెలుగునీ చీకటినీ కొలుస్తున్నట్టు తాపీగా నడుస్తూ యిల్లుచేరాడు రామారావు. కానీ పొద్దున్నొచ్చిన సందులోంచికాక మరో సందులోంచి వచ్చాడు. పొద్దున్న సందులో చూసిన శవం అక్కడ వుండకపోయినా... దానితాలుకు ఆలోచనల్నించి తప్పించుకోటానికి సందు మార్చాడు.

రామారావు యిల్లు చేరేటప్పటికి అన్నాలు తినేసి పిల్లలు చదువుకుంటున్నారు.

మంచంమీద వోరగా వాలి పడుకున్న లక్ష్మి లేచి వంటింటిలోకి నడిచింది.

అన్నం తినొచ్చాక పిల్లలవేపుచూశాడు. మధ్యమధ్యలో తలెత్తి తండ్రివేపు చూసినా వాళ్ళేం మాట్లాడలేదు. తండ్రి పలకరిస్తేనే కానీ వాళ్ళు పలకరు. నెమ్మదిగా ట్రాన్సిస్టర్ తీసుకుని వీధి అరుగు మీదకి నడిచాడు రామారావు.

* * *

పిల్లలందరూ పడుకున్నారన్నట్టు లక్ష్మి అరుగుమీదికి వచ్చింది. అలా భార్య రావటం చూసి నెమ్మదిగా లేచాడు రామారావు. ట్రాన్సిస్టర్ ముందుగదిలో పెట్టి లోపలి కెళ్ళాడు.

పిల్లలందరూ పొద్దున్నలాగే తలో కోణంలో గందరగోళంగా నిద్దర్లో వున్నారు.

"అలారం పెట్టావా..." అన్నాడు.

పెట్టానన్నట్టు తలూపింది లక్ష్మి.

నెమ్మదిగా మంచమెక్కాడు రామారావు. వెలుగుతున్న లైటువేపు చూశాడు రామారావు.

నెమ్మదిగా అడిగింది లక్ష్మి... "పిల్లల దగ్గర పడుకోమంటారా" అని.

నెమ్మదిగా రామారావు తలతిప్పి లక్ష్మి వేపు చూసి పడుకోమన్నట్టు తలూపాడు.

అంతే...ఆరోజు రొటీన్‌లో శృంగారం లేదన్నమాట.

లక్ష్మి లైటువేపు కదులుతూ చిన్నగా నవ్వబోయింది... రామారావూ నవ్వబోయాడు...నవ్వబోయి పెదాలు కదిపాడు... బలవంతంగా రామారావు పెదాలు పూర్తిగా కదిలేలోపు లక్ష్మి లైటార్పేసింది.

* * *

"ఏం అలా వున్నావేం..." చీకటి ప్రశ్నించింది.

రామారావేం మాట్లాడలేదు. చీకటిని చూస్తూ బలవంతంగా కళ్ళుమూసుకున్నాడు. ఎక్కడచూసిన దృశ్యమో మరి... తీగమీద తూలుతూ...సర్దుకుంటూ...బేలన్స్‌గా పడిపోకుండా నడిచేనడక కళ్ళముందు కదిలింది.

చాలీ చాలని యీ సంపాదనతో...యీ పరిస్థితుల్లో... ఏం చెయ్యటానికేనా, ఏం ఆలోచించటానికేనా యింతగా భయపట్టం అలవాటైపోయాక, యంత్రాల్లా యిలాకాక మరెలా బతకటం...అనుకున్నాడు. *